వంశీ బర్కిలీ అవార్డ్స్ 1979 కథల పోటీలో తృతీయ స్థానాన్ని పొందిన కథ

# మాల్ న్యూట్రిషన్

**ఆ**ఖరి అవుట్ పేషంట్‌ని కూడా చూసి పంపించేసి "ఇంకెవ్వరూ లేరు కదా సిస్టర్" కుర్చీలోంచి లేవబోతూ అడిగాను .

"లేరు డాక్టర్"

వాష్ బేసిన్ దగ్గరికెళ్ళి చేతులు కడుక్కొని నేప్‌కిన్‌తో చేతులు తుడుచుకుని స్ప్రింగ్ డోర్ గెంటి బయటికడుగెయ్యబోతోంటే, ఓ నలభై ఏళ్ళామె భుజం మీద కుర్రాడ్ని ఎత్తుకుని తీసుకొచ్చి, వరండాలో పడుకోబెట్టి శోకాలు తీయసాగింది.

నర్స్ ఆమెని కసురుకొంటుంటే రెండంగల్లో వెళ్ళి ఆ కుర్రాడిని సమీపించాను.

ఆ పిల్లాడికి పది పన్నెండేళ్ళుంటాయి. ఒంటి మీద స్పృహ లేదు. శవంలా పడి వున్నాడు. కడుపు వీపునంటుకు పోవడంతో రాబందులు సగం తిని వదిలిన గొడ్డు ప్రక్కటెముకల్లా కన్పిస్తున్నాయతడి ప్రక్కటెముకలు. రాయలసీమ నూతి నీళ్ళలా కళ్ళుంటే, వడలిన తోటకూరకాడల్లా ఎండిన పాముల్లా వున్నాయ్ చేతులు. ఎక్కడో ఏ మూలో ప్రాణం మిగిలి వుందనడానికి నిదర్శనంగా వుండుండి ఎగిసెగిసిపడుతోంది రొమ్ము.

కదలడానికి కూడా శక్తిలేక చలన రహితంగా పడివున్న వాడ్ని చూసి ఏడవలేక ఏడుస్తోంది ఏడవడానిక్కూడా శక్తిలేని ఆ పిల్లాడి తల్లి.

పిల్లాడ్ని స్టెత్‌తో పరిక్షిస్తూ "ఎందుకిలా వున్నాడు? అసలేమయ్యింది? ఎన్నాళ్ళనుంచిలా వుంటున్నాడు?" అని ప్రశ్నించాను.

బావురుమందామె.

"పదినాళ్ళనుండి కూడునేదుబావుఁ గుంటడికి. నిన్ననగా సొమ్మసిల్లి పడిపోయిండు. ఏం జేత్తు బావుఁ సేతిల పైస నేదు. ఏరితో సెప్పుకోను బావుఁ ! నాను ముద్ద నోట్లో ఎట్టి పదేను దినాలయ్యినాది, పోరగాడ్ని నువ్వే రచ్చించాల బావుఁ నీకాల్మొక్త! మాయదారి గడ్డురోజులొచ్చినై బావుఁ పనిలేదు. నాస్తా లేదు. గరీబోళ్ళమింకెలా బతికేది బావుఁ..."

ఆమె ఆవేదన విని తల్లడిల్లి పోయాను. ఆమె మాటలెంత నగ్న సత్యాలో పిల్లాడి పరిస్థితే చెబుతోంది. వాడి పరిస్థితి చాలా క్రిటికల్‌గా, ప్రమాదకరంగా వుంది. బాగా వేడెక్కిన చిమ్నీతో వాడి పరిస్థితిని పోల్చవచ్చు. ఏ చిన్న నీటి బిందువు పడ్డా ఆ చిమ్నీ

పగిలిపోవటం ఖాయం. అంచేత చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలనీ, ఆ తల్లి కన్నీళ్ళు తుడవాలనీ నిర్ణయించుకుని వార్డ్ బోయస్‌ని పిలిచి పిల్లాడిని లోపలికి–ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్ళాను.

వెంటనే సెలైన్ బాటిల్స్ తెప్పించి ఎక్కించాను. నాడి బలహీనంగా కొట్టుకుంటూండటంతో కొన్ని ఇంజెక్షన్లవీ చేశాను. ఆ పిల్లాడి తల్లి కళ్ళల్లో ఆశా దీపం వెలిగించుకొని చూస్తూండటం చూస్తుంటే నాలో పట్టుదల మరింత పెరుగుతోంది.

ఎలాగైనా సరే ఈ కేస్‌ని సక్సెస్ చెయ్యాలని నిశ్చయించుకొని నా డ్యూటీ టైం అయిపోయినా కంటికి రెప్పలా చూస్తూ తగిన ట్రీట్‌మెంట్ చేస్తూండిపోయాను.

ఓ గంట గడిచిందో లేదో, "మీకు ఫోన్ సార్" అంటూ వచ్చింది నర్స్. ఫోన్ దగ్గరికి నడిచాను.

"హలో"

"డాక్టర్ రావు గారేనా మాట్లాడుతోంది?"

"అవునండీ – మీరెవరు?"

"నేను వెంకట్రామయ్య గారింటి నుంచి మాట్లాడుతున్నానండీ. పార్టీ మొదలవ్వబోతోంది. మిమ్మల్ని త్వరగా రమ్మని పిలవమన్నారు..."

"ఆలాగే"

"తప్పకుండా ఓ పావుగంటలో రావాలి, ఆఫీసర్సంతా వచ్చేశారు మీరు తప్ప"

"ఐ విల్ ట్రై" కొంచెం కోపంగానే రిసీవర్ పెట్టేశాను.

"వెళుతున్నారా డాక్టర్?" నర్స్ అడిగింది. బహుశా ఫోను సంభాషణంతా విని వుండొచ్చు.

"ఇంకా నిర్ణయించుకోలేదు"

"కానీ వెళ్ళకపోతే ఆయనేమైనా అనుకుంటారేమో డాక్టర్, సూపరిండెంటు గారూ మిగిలిన డాక్టర్లూ కూడా వెళ్ళారు"

"కావొచ్చు. కాని అవతల పేషంట్ సీరియస్ కండీషన్‌లో వుండగా... చూస్తాను" అనేసి వచ్చేశాను పేషంట్ దగ్గరికి.

నిజమే. తను పార్టీకి వెళ్ళకపోతే వెంకట్రామయ్య గారేదో అనుకోవచ్చు. తను కొత్తవాడు గనుక తనకి గర్వం ఎక్కువనుకోవచ్చు. క్రితం రోజున సూపరిండెంటు గారన్నట్టు తన గురించాయనకి అలాటి ఇంప్రెషన్ కలుగజెయ్యడం మంచిది కాదు. కాని ఇవతల పేషంట్...!

బహుశా నా మొఖం పెద్ద పెద్ద పార్టీలకి వెళ్ళే మొఖంలా కన్పించలేదేమో,

సూపరిండెంటు గారు, "పార్టీకి తప్పకుండా రా" అంటూ ఒక రకంగా హెచ్చరించారు. కనీసం ఆయన గురించైనా వెళ్ళాలి. కాని...

మరో అరగంట గడిచిందో లేదో ఇంకో ఫోన్ వచ్చింది. వాళ్ళు నా మీద చూపిస్తోన్న శ్రద్ధని అభిమానం అనుకోవాలో, అహంకారం అనుకోవాలో తేల్చుకోలేక పోయినా వెళ్ళాలని నిశ్చయించుకుని బయల్దేరుతున్నానని చెప్పేను. ఎంచేతంటే పేషంట్ కండిషన్‌లో చాలా చాలా ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తోంది.

పిల్లాడి తల్లితో చెబితే తన పిల్లాడ్ని గాలిలో దీపం పెట్టి వదిలేసి వెళ్ళిపోతున్నట్టుగా అనుకుంటుందని ఆమెకేం చెప్పలేదు. నర్సుకి మాత్రం జాగ్రత్తగా చూస్తుండమని చెప్పి, కొన్ని సూచనలిచ్చి, అవసరమైతే నాకు ఫోన్ చెయ్యమన్నాను. నైట్ డ్యూటీ నాది కాదు గనుక నైట్ డ్యూటీ డాక్టర్‌తో కూడా చెప్పమని, పార్టీ అవ్వగానే వచ్చి చూస్తానని కూడా చెప్పి హాస్పిటల్నుంచి బయటపడేసరికి ఎనిమిది గంటలయ్యింది.

ఆటోలో వెంకట్రామయ్య గారింటి కెళ్ళాను.

అప్పటికే అక్కడి కెన్నో రకాల వాహనాలు వచ్చి వున్నాయ్. ఆయన పెద్ద మేడ కూడా రంగురంగుల విద్యుద్దీపాలతో, ఖరీదయిన మనుషులతో మేడమీంచి వినవచ్చే సంగీతంతో మార్మోగిపోతోంది. ఇంత సంబరమూ ఆ ఇంట్లో జరగబోతోన్న పెళ్ళి గురించీ కాదు గృహ ప్రవేశం గురించీ కాదు వెంకట్రామయ్యగారి బర్త్‌డే సందర్భంగా అయనేర్పాటు చేస్తోన్న పార్టీ గురించి. అవును మరి! వెంకట్రామయ్య గారిలాంటి ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ పుట్టినరోజుకేమిటి? తుమ్మితే పార్టీ ఇవ్వగలడు. సిరిగలవానికి చెల్లును చేతలెన్ని చేసినా!

సంపంగి పువ్వులు రెండు అందిచ్చి కాస్త పన్నీరు జిమ్మి ఆహ్వానించారో ఇద్దరమ్మాయిలు. మరొకరు మేడపైకి వెళ్ళమని చెప్పేరు మద్యాదగానే.

మేడపైన పెద్ద షామియానా క్రింద ఎన్నెన్నో కుర్చీలూ టేబుల్సూను. రకరకాల సూట్లలో చీరల్లో పెద్ద ఉద్యోగస్తులూ, వారి భార్యలూ వున్నారు. అంతా వుత్సాహంగా మాట్లాడేసుకుంటున్నారు. అవసరమున్నా లేకపోయినా నవ్వుకుంటున్నారు. కొందరు తమ తమ పెళ్ళికాని – పెళ్ళికెదిగిన అబ్బాయిల్ని అమ్మాయిల్ని కూడా వెంటబెట్టుకునొచ్చారేమో కొంచెం 'పెళ్ళి సంత'గానూ మారింది అక్కడక్కడా పరిస్థితి.

నేనొక్కడ్నీ ఒక ప్రక్కన కూర్చున్నాను. నన్నెరుగున్న వాళ్ళు తక్కువ. అంచేతే కాబోలు నన్నెవ్వరూ పలకరించలేదు.

ఓ ప్రక్కన అరేంజ్ చేసిన స్టేజి మీద నిలబడి జాజ్ సంగీతం కాబోలు విన్పిస్తున్నారు కొందరు యువకులు. వాళ్ళు ఫలానా బార్లో వాయిస్తూంటారని ఒకాయన వివరణ ఇస్తున్నాడు ప్రక్కతనికి.

నాకెందుకో ఆ వాతావరణంలో కృత్రిమత్వమే ఎక్కువగా కన్పిస్తోంది. నేను మధ్యతరగతి వాడ్నైనా హైసొసైటీ అనబడే ధనికుల విందులూ, విలాసాలూ నాకు నచ్చవు. దేశంలో సగం జనాభా బిలో ది పావర్టీ లైన్‌లో వుంటే, సంపదంతా కేవలం కొద్ది కుటుంబాల చేతిలో కేంద్రీకరింపబడి వుండటంతో వాళ్ళు విందుల్తో, వినోదాల్తో కాలక్షేపం చేస్తున్నారు. సోషలిజం సోషలిజం అని శోష వచ్చేట్లు చెప్పడం తప్ప ఏ ప్రభుత్వం ఇంతవరకూ ఈ దేశంలో ఆ వ్యత్యాసాల్ని తొలగించింది? బేరేజ్ కడుతున్నా, ఆఖరికి కాలువ తవ్వుతోన్నా బక్క రైతూ, పెద్ద రైతూ అని చూడకుండా అందరి మీదా పన్ను వేసే ప్రభుత్వం గొప్ప వారి మీద కొత్త టాక్సులు వెయ్యడానికి వెనకా ముందూ ఆడుతూంటుంది, అదేం చిత్రమో!

ఒంటరిగా కుర్చీలో కూర్చోలేక పిట్ట గోడవైపు వెళ్ళి ఆకాశం వంక దృష్టి సారించాను. చంద్రుడు చేటంత ముఖం చేసుకుని నవ్వుతుంటే చుక్కలు వెల వెలబోతూ కొడిగట్టిన దీపాల్లా వెలుగుతున్నాయి. చిత్రమేమిటంటే నక్షత్రాలకి స్వయం ప్రకాశశక్తి వుంది, చంద్రుడికి లేదు!

అనుకోకుండా నా దృష్టి మేడప్రక్క సందు మీద పడింది.

అక్కడ రెండు చెత్తకుండీలున్నాయ్. వాటి ప్రక్కనో పదిహేను ఇరవై మంది వరకూ ఆడా మగా పిల్లా పీచూ వున్నారు. ఆశగా, ఆరాటంగా మేడపైకి చూస్తున్నారు. అంటే ఆ పార్టీలో మిగిలిపోయిన పదార్థాల్ని ఎప్పుడా చెత్తకుండీల్లో పారేస్తారా, ఎప్పుడు దానితో తమ ఆకలి తీర్చుకుందామా అని ఎదురు చూస్తున్నారన్న మాట!

నా గుండెలు తరుక్కుపోతోంటే వాళ్ళ వంక జాలిగా, బాధగా చూస్తూండిపోయాను.

వాళ్ళు బక్కగా ప్రాణాలు తప్ప ఇంకేమీ లేని వాళ్ళలా వున్నారు. జుట్టు చింపిరి గానూ, అట్టలు కట్టి వుంటే వారి దుస్తులు చిరిగి పీలికలై వున్నాయ్.

ఎవరో నన్ను పిలిచారు.

మౌనంగా వెళ్ళి కూర్చున్నాను.

మంత్రిగారు వచ్చేరు. సందడి పెరిగిపోయింది. ఎటు చూసినా నమస్కారాలూ నవ్వు ముఖాలూ పలకరింపులూ చిలకరింపులూ వినయాలూ విట్లూ!

వెంకట్రామయ్య గార్ని స్టేజీమీద కాహ్వానించి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ దండలతోనూ, ప్రశంసలతోనూ ముంచెత్తారంతా.

చిన్న సైజు కందుల బస్తాలా ఉన్న అరవై అయిదేళ్ళ వెంకట్రామయ్య గార్ని చూస్తోంటే నాకేవిటో ఎబ్బెట్టుగా అన్పించింది. ఏ పది పన్నెండేళ్ళ వయస్సు వరకూనో పుట్టినరోజు పండుగలు చేసుకుంటే బావుంటుంది గాని నడివయస్సు దాటేక చేసుకుంటే

ఏం బావుంటుంది? ఒక్కో సంవత్సరం పైబడుతూంటే నువ్వు ముసలివాడివై పోతున్నావు సుమా, మృత్యువుకు దగ్గరవుతున్నావు సుమా అని హెచ్చరించుకుంటున్నట్లేగా!

హాస్పటల్లోని ఆ కుర్రాడి కెలా వుందో ఫోన్ చేసి కనుక్కుందామని చూశాను గాని మేడ పైన ఫోన్ లేదు. వెంకట్రామయ్య గార్ని పొగుడుతూ ఉపన్యాసాలు మొదలవడంతో మేడ దిగి వెళ్ళటం బావుండదని ముళ్ళ మీద కూర్చున్నట్టు కూర్చుండి పోయాను.

ఉపన్యాసాలనంతరం స్టేజీ మీద నృత్యం మొదలయ్యింది. ఒక మగ డాన్సరూ ఒక ఆడ డాన్సరూ చేస్తోన్న ఆ నృత్యాన్ని నృత్యం అనేకన్నా కామకేళి అంటేనే బావుంటుందేమో!

పార్టీ కూడా మొదలయ్యింది. యూనిఫారం ధరించిన సర్వర్లు (ఏ బార్‌లో పనిచేస్తున్న వాళ్ళో మరి!) గబ గబా రకరకాల డిషెస్ సెర్వ్ చేస్తున్నారు. వాటిలో నేనెరుగనివి, పేరు కూడా తెలియనివి చాలా వున్నాయ్. నే నెరుగున్నవి ఫలావ్, చికెన్ జాయింట్సు, కొన్ని కూరలు, స్వీట్లు, ఫ్రూట్ సలాడ్, బాదంగీర్ – వగైరా వగైరా. హాట్ డ్రింక్స్ కూడా వున్నాయ్!

తింటున్నారు – తాగుతున్నారు – తూలుతున్నారు – పేలుతున్నారు.

వాతావరణం సభ్యతని దాటుతోంటే మెల్లగా ఒక్కరొక్కరే లేచి శలవు తీసుకుని వెళ్ళిపోసాగారు – ఇంకా అక్కడ వుండి సీన్స్ క్రియేట్ చెయ్యడం ఇష్టం లేక కాబోలు!

ఇంచు మించు అన్ని టేబుల్స్ మీదా సగం సగం చొప్పున మిగిలిపోయిన పదార్థాలు వెర్రిమొఖాలేసుకుని చూస్తున్నాయ్!

ఆ ప్లేట్ల లోని పదార్థాలన్నిటినీ పని వాళ్ళు గబగబా తీసుకెళ్ళి చెత్త కుండీల్లో పారేస్తున్నారు.

బయట – చెత్త కుండీల దగ్గర గోలగా వుంది. బహుశా అక్కడ మనుషులు కుక్కల్తో బాటు కాట్లాడుకుంటూండి వుంటారు!

కింది కొచ్చేసి ఆటో ఎక్కాను.

నిద్ర తూలుతోన్న దృష్ట్యా ఇంటికెళ్ళి పోతేనే బావుంటుందన్న మాట నిజమే అయినా, అవతలా పూర్ పేషంట్ ఎలా వున్నాడో అన్న ఆవేదన ఆటోని ఆసుపత్రివైపు మరల్చింది.

నేననుమానించినంతా అయ్యింది. పేషంట్ వూపిరందక తన్నుకుంటున్నాడు. వెంటనే ఆక్సిజన్ సిలిండర్‌ని తెప్పించి అతడికి కనెక్ట్ చేశాను. ఇంకో బాటిల్ గ్లూకోజ్ ఎక్కించాను.

ఆ పిల్లాడి తల్లి నా వంకెంతో కృతజ్ఞతతో చూస్తోంటే ఆ రాత్రి డ్యూటీ నాది

గాకపోయినా ఆ  పేషంట్ గురించక్కడే వుండిపోయాను.

ఆ కుర్రాడు నా 'రెలిటివ్' గాకపోయినా నేనంత శ్రద్ధగా ట్రీట్ చెయ్యడం ఆశ్చర్యం కలిగించిందో ఏమో, "మీకెందుకు సార్ ఇంత శ్రమ?" అంది నర్స్.

నవ్వి వూరుకున్నాను.

అంతకంటే ఏం చెప్పగలను? అసలు నేనీ గవర్నమెంట్ సర్వీసులో జేరటం కూడా నేను చెయ్యగల మానవసేవ చేద్దామనే. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టి కూడా చెయ్యొచ్చు గాని ఏ క్షణంలోనైనా స్వార్థం నా ఆశయాన్ని కబళించెయ్యొచ్చని ఈ వుద్యోగంలో చేరాను. ఇదంతా ఆమెకిప్పుడెలా చెప్పగలను? చెబితే నన్నో వెర్రివాడిగా చూసినా ఆశ్చర్య పడక్కర్లేదు!

"నైట్ డ్యూటీ సుధాకర్ దనుకుంటాను. రాలేదా?"

"పార్టీ కెళ్ళేరు కదా డాక్టర్, ఇక ఈ రాత్రికి రాలేనని ఇంపార్టెంట్ కేస్ వుంటే ఫోన్ చెయ్యమని చెప్పేరు"

నిట్టూర్చి వూరుకున్నాను.

డాక్టర్లకి పేషంట్ల కన్నా వెంకట్రామయ్యగార్నీ ఇతర రాజకీయ నాయకుల్నీ కాకా పట్టడం ముఖ్యం మరి. బదిలీలు కావాలన్నా, ప్రమోషన్లు రావాలన్నా అందుకు గీటురాయి కాకా తప్ప సేవ కాదు! ఇదీ ఈనాడు నా దేశ పరిస్థితి !

ఆ రాత్రంతా ఆ కుర్రాడ్ని కంటికి రెప్పలా దగ్గరుండి మరీ కాపాడినా ఫలితం లేకపోయింది. నా శ్రమంతా బురదలో పోసిన పన్నీరైపోయింది!

అంతవరకూ ఆ పిల్లాడిలో మిణుకు మిణుకుమంటూ ఎప్పుడెప్పుడా అని చూస్తోన్న ప్రాణం గుప్న ఎగిరిపోయింది!

ప్రాణం పోయినా అంతక్రితానికీ ఇప్పటికే వాడిలో పెద్దగా తేడా లేకపోవడం చూసేసరికి ఆశ్చర్యం, గుండెల్ని ఉక్కు పిడికిళ్ళతో పిండేస్తోన్న బాధ కలిగాయ్. ఈ స్వతంత్ర భారత్‌లో ఆకలి చావులకి గురై మరణిస్తోన్న అభాగ్యులు కూడా ఉన్నారింకా!

పిల్లాడి చావు వార్త విని ఆ తల్లి గుండెలు పగిలేలా బండలు కరిగేలా విలపించలేదు. అసలు కన్నీర్రాలేదు. కన్నీరు ఇంకిపోయిందో లేక ఇలాగైనా వాడికి ఆకలి నుంచి విముక్తి లభించిందనుకుందో, లేక తనకు బరువు తగ్గిందనుకొంటోందో – అది ఆమె మనస్సుకే తెలియాలి!

రిపోర్టు రాసి విషాదమూర్తిలా బయటికొచ్చేసరికి హాస్పటల్ సూపరిండెంట్ ఎదురయ్యాడు.

"హలో"

"గుడ్ మార్నింగ్ సర్..."

"నిన్నట్నుంచీ ఏదో కేస్ సీరియస్‌గా చూస్తున్నావుట. ఎలా వుంది?"

"దురదృష్ట వశాత్తూ ఫెయిల్ అయ్యింది సార్..."

"ఐసీ – ఎనీవే – నిరాశా నిస్పృహలు డాక్టర్ దరిజేరకూడదు. ఇంతకీ, కేసు వివరాలేమిటి?" అంటూ వెళ్ళి కేస్ షీట్ చూసి కనుబొమ్మలెగరేశారు. "వాటీజ్ దిస్?"

"అవున్సార్, తిండిలేక మరణించాడు సార్"

"నో నో – అలా ఎప్పుడూ రాయకూడదు. ఆహారం తక్కువవడం వల్ల అంటే మాల్ న్యూట్రిషన్ వల్ల మరణించారనే రాయాలి, తెల్సిందా?"

"కాని వాళ్ళసలు ఆహారమే లేక..."

"డొంట్ ఆర్గ్యూ విత్ మీ మై డియర్ బోయ్ ! నేను చెప్పినట్లు చేయండి. అసలిలాటి విషయాలన్నీ మీకు కాలేజీ లోనే చెప్పుండాలే"

కేస్ షీట్ మీద అంతక్రితం రాసింది కొట్టేసి "మాల్ న్యూట్రిషన్ వల్ల..." అని రాస్తోంటే నా చెయ్యి వణికింది.

సరిగ్గా అదే సమయంలో ఆ పిల్లాడి తల్లి మొదలు నరికిన మ్రానులా దభీమని కూలబడిపోయింది.

అదీ మాల్ న్యూట్రిషన్ కేసని రాయాలని గుర్తుకొచ్చి మ్రాన్పడిపోయాను!

కన్నీళ్ళు పొంగివచ్చాయ్!

"సారీ మైడియర్ కంట్రీమెన్...' గొణుక్కున్నాను నాలో.

* * *

**(స్వాతి మాస పత్రిక, జూన్ 1980)**